క్లుప్తంగా

శాకంబరిగా కనకదుర్గమ్మ



కూరగాయల అలంకరణలో గోకవరం దేవీచౌక్ కనకదుర్గమ్మ

గోకవరం: స్థానిక దేవీచౌక్ ఆలయంలో కొలువైన కనకదుర్గ అమ్మవారు శుక్రవారం శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు వల్లూరి జగన్నాథశర్మ, శ్రీనివాస్‌శర్మ సుమారు వెయ్యి కేజీల కూరగాయలు, పండ్లతో అమ్మవారిని సుందరంగా అలంకరించారు. విశేష సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

దరఖాస్తుల స్వీకరణ



మునికూడలిలో ప్రజలతో మాట్లాడుతున్న ఎంపీడీవో రమేష్, పార్టీ నాయకులు

సీతానగరం: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎంపీడీవో కె.రమేష్, ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, వైస్ ఎంపీపీ 2 సత్యం మదన్ బాబు, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు అంబటి రాజు, పార్టీ నాయకులు కవల కృష్ణమూర్తి తదితరులు మునికూడలిలో పర్యటించారు. ప్రతి ఇంటికీ వెళ్లి జగన్ ప్రభుత్వంలో చేకూరిన లబ్ధిని వివరించారు. సంక్షేమ పథకాలకు సంబంధించిన 11 రకాల సర్టిఫికెట్లను అందిస్తామన్నారు. వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. పార్టీ నాయకులు కవల దుర్గం, ఆకుల సత్యనారాయణ, కొల్లి చిరంజీవి పాల్గొన్నారు.

నేటి నుంచి జగనన్న సురక్ష శిబిరాలు

రాజమహేంద్రవరం సిటీ: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా శనివారం నుంచి శిబిరాలను సజావుగా నిర్వహించాలని కార్పొరేషన్ కమిషనర్ కె.దినేష్ కుమార్ పిలుపు నిచ్చారు. ఈ మేరకు శుక్రవారం 1 నుంచి 4 డివిజన్లలో తొమ్మిది సచివాలయాలకు సంబంధించి అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ సచివాలయంలో వివరాలు తెలియజేయడానికి హెల్ప్‌డెస్క్, స్పందన కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. లబ్ధిదారుల వివరాలు నమోదు చేసేందుకు రిజిస్ట్రేషన్ కౌంటర్ ఏర్పాటు చేయాలన్నారు. ఒకటో డివిజనకు సంబంధించి లాలాచెరువు సుబ్బారావుపేటలోని సచివాలయం, 2వ డివిజన్‌కు నారాయణపురం వాంబేగ్ర హాల వద్దగల కమ్యూనిటీ హాలు, 3, 4 డివిజన్లకు రాజేంద్రనగర్‌లోని కమ్యూనిటీ హాలులో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ క్యాంపులు నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కమిషనరు సత్యవేణి, సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.పాండురంగారావు పాల్గొన్నారు.

మిగిలిన సత్రం భూములకు వేలం నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కర్నాకుల వీరాంజనేయులు

గోకవరం: మండలంలోని రంపయర్రంపాలెంలో వేలం నిర్వహించని 15.50 ఎకరాల భూమికి వెంటనే బహిరంగ వేలం నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు డిమాండ్ చేశారు. ఇటీవల సుందర్మ సత్రం భూములకు కౌలువేలం నిర్వహించడంపై శుక్రవారం గ్రామంలో విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కర్నాకుల మాట్లాడుతూ భూస్వాముల నుంచి విముక్తి కల్పించి, సత్రం భూములను పేదలు కౌలుకు చేసుకోవడానికి కృషి చేసి సంఘం సభ్యులను అభినందించారు. ఈ సత్రం భూముల్లో ఇంకా 15.50 ఎకరాల భూమికి వేలం నిర్వహించాల్సి ఉందని, తక్షణమే ఈ భూములకు వేలం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వల్లూరి రాజబాబు, బి.రమేష్, సహాయ కార్యదర్శి కడితి సతీష్, జిల్లా నాయకులు మడికి సత్యం, దేశెట్టి సురేష్, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కన్వీనర్ మంగక్క, అంజిబాబు పాల్గొన్నారు.

బస్సు యాత్ర ప్రారంభం

రంగంపేట: భవిష్యత్తుకు గ్యారంటీ పేరిట టీడీపీ చేపట్టిన బస్సుయాత్ర వడిశలేరు గ్రామంలో శుక్రవారం ప్రారంభమైంది. మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ యాత్రలో మాజీ మంత్రి కేఎస్ జవహర్, జ్యోతుల నెహ్రూ, బండారు సత్యానందరావు, రెడ్డి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పెదపూడి: పెద్దాడలో భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా బస్సు యాత్ర, బహిరంగ సభను శుక్రవారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు మాట్లాడారు. ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, వేగుళ్ల జోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కల.. నెరవేరిన వేళ..

- జగనన్న కాలనీల్లో చురుగ్గా ఇళ్ల నిర్మాణం
- అన్ని వసతులూ కల్పిస్తున్న ప్రభుత్వం
- లబ్ధిదారుల హర్షం

మధురపూడి: పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలందరి ప్రధాన కోరిక సొంతిళ్లు. మంచి ఇళ్లు కట్టుకుని పిల్లాపాపలతో సంతోషంగా ఉండాలని కలలు కంటారు. కానీ నేటి పరిస్థితుల్లో ఆ కోరిక చాలామందికి కలగా మిగిలిపోయింది. అయితే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పేదల కలను సాకారం చేశారు. పేదలందరికీ ఇళ్లు ఇస్తానని ఎన్నికల సమయంలో ఆయన హామీ ఇచ్చారు. ఆ మేరకు అధికారంలోకి రాగానే కార్యాచరణ చేపట్టారు. నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేశారు. పేదల సొంతింటి కలను సాకారం చేయడం కోసం కోరుకొండ మండలంలోని 22 గ్రామాల్లో 20 లేఅవుట్లు ఏర్పాటు చేసి, వాటిలో 1,916 ప్లాట్లు వేశారు. వాటిని 1,504 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఇప్పటికే 194 ఇళ్ల నిర్మాణం పూర్తయ్యింది. 1,302 ఇళ్లు నిర్మాణ దశలో, 8 ప్రారంభ దశలో ఉన్నాయి. ఇక రెండో ఫేజ్‌లో 19 లేఅవుట్లు ఏర్పాటు చేస్తున్నారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ త్వరలో చేపడతారు.

ఇంటి నిర్మాణానికి సాయం

జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించుకోవడానికి వీలు లబ్ధిదారులకు రూ. రూ.1,80 లక్షలను ప్రభుత్వం అందజేస్తోంది. ఈ నగదును బేస్‌మెంట్, రూఫ్ లెవల్, శ్లాబ్, నిర్మాణం పూర్తయ్యాక వివిధ దశల్లో అందజేస్తోంది. ఈ నగదు నేరుగా లబ్ధిదారుడి బ్యాంకుఖాతాలో జమవుతోంది. అలాగే సొంత స్థలమున్న వారికీ ఈ పథకం వర్తింపజేస్తున్నారు. 1.50 సెంట్లు ఉన్నవారు అర్హులు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గృహనిర్మాణశాఖ ఈ అవకాశం కల్పించింది.

ప్రతిపక్షాలతో కోర్టు వివాదాలు : పేదలందరికీ ఇళ్ల స్థలాలు పంపిణీ చేయడానికి ప్రతిపక్ష పార్టీల నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారు. వారు కొన్ని స్థలాల విషయంలో కోర్టుకు ఎక్కడంతో కొన్ని గ్రామాల్లో పేదలకు ఇళ్ల స్థలాలు దక్కలేదు. మండలంలోని దోసకాయలపల్లి, నిడిగట్ల, బూరుగుపూడి, గాడాల, గరగలంపాలెం గ్రామాల్లో ఈ సమస్య ఏర్పడింది. పశ్చిమగానుగూడెం, కోరుకొండ, కాపవరం శ్రీరంగపట్నం, గాదరాడ గ్రామాల్లో ఇతర సమస్యల కారణంగా పంపిణీ జరగలేదు.

వివరాలు ఇవీ

మండలం	కోరుకొండ
లేఅవుట్లు	20
లబ్ధిదారులు	1,504
పూర్తయినవి	194
నిర్మాణ దశ	1,302
ప్రారంభ దశ	8



మునగాల లేఅవుట్‌లో నిర్మాణంలో ఉన్న ఇళ్లు



మధురపూడిలో గృహప్రవేశం జరిగిన ఇళ్లు

అద్దె కట్టలేక ఇబ్బంది పడ్డాం



సొంతిల్లు లేకపోవడంతో అద్దె కట్టుకోవడానికి చాలా ఇబ్బందులు పడ్డాం. ప్రతి నెలా రూ.2,500 నుంచి రూ.3 వేలు వరకూ అద్దె చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడేది. మండల కేంద్రాల్లో ఈ అద్దెల భారం మరీ ఎక్కువగా ఉండేది. నా సొంతింటి కల నేరవేరడం ఆనందంగా ఉంది.

– గొర్ల దుర్గాదేవి, మునగాల

జగనన్న మేలు మరువలేం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేలు మరువలేం. ఆయన చలువతో సొంతిల్లు నిర్మించుకున్నాం. త్వరలో గృహ ప్రవేశం చేసుకుంటాం. మునగాలలో నాకు 1.50 సెంట్ల స్థలం ఇచ్చారు. ఇంటి నిర్మాణం కోసం రూ.1,80 లక్షలు అందించారు.

– గవరసాని చంద్రకుమారి, మునగాల

జోరుగా ఇళ్ల నిర్మాణం

కోరుకొండ మండలంలో 20 లేఅవుట్లలో 1,504 మంది లబ్ధిదారులున్నారు. ఇళ్ల నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. వీటిలో 194 గృహాలు పూర్తయ్యాయి. 1,302 నిర్మాణ దశల్లో ఉన్నాయి. విద్యుత్, తాగునీరు, రోడ్లు, మౌలిక వసతులు కల్పిస్తున్నాం. ఫేజ్ 2 లేఅవుట్లు 19కి సంబంధించి లబ్ధిదారుల ఎంపిక జరగనుంది.

– ఆకుల వీర వెంకట్రావు, ఏఈ, గృహ నిర్మాణ శాఖ, కోరుకొండ

సామాజిక బహిష్కరణపై ఆర్డీఓ విచారణ



తిరుమలాయపాలెంలో విచారణ నిర్వహిస్తున్న ఆర్డీఓ చైత్రవర్షిణి

గోకవరం: మండలంలోని తిరుమలాయపాలెంలో శుక్రవారం రాజమహేంద్రవరం ఆర్డీఓ చైత్రవర్షిణి విచారణ నిర్వహించారు. గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు, తదనంతరం తొలగింపు విషయంలో ఓ వర్గం వారిపై సామాజిక బహిష్కరణ జరిగిందన్న ఆరోపణలు తలెత్తాయి. ఇటీవల ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ సైతం రెండుసార్లు గ్రామంలో పర్యటించారు. సామాజిక బహిష్కరణ ఆరోపణలపై ఆర్డీఓ గ్రామంలో విచారణ నిర్వహించి దుకాణాల వద్దకు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పలువురితో మాట్లాడి ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ కడలి వెంకటేశ్వరరావు, తహసీల్దార్ సుగుణ, పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

బిక్కవోలు: పందలపాకలో ఉచిత వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు సూరారెడ్డి నర్సింగ్ హోమ్ ఎమర్జెన్సీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ మల్లిడి కృష్ణారెడ్డి తెలిపారు. శనివారం డాక్టర్స్ డే సందర్భంగా ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. స్త్రీల వ్యాధులకు డాక్టర్ ఎం.లీలాసెరీస్, డాక్టర్ పి.కీర్తి, జనరల్ సమస్యలకు ఎం.భార్గవి తదితరులు వైద్య సేవలు అందిస్తారన్నారు. రోగులు ఆధార్ కార్డు తీసుకురావాలని అన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రాజానగరం: మండలంలోని రెండు గ్రామాలలో ఖాళీగా ఉన్న మూడు వలంటీర్ల పోస్టులను భర్తీ చేయనున్నామని, ఆసక్తి, అర్హత ఉన్నవారు ఆన్‌లైన్‌లో జూలై 4 లోగా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ బి.రామారావు విజ్ఞప్తి చేశారు. భూపాలపట్నంలో రెండు పోస్టులను మహిళ (అన్ రిజర్వుడ్)లకు, కలవచర్లలోఒక్క పోస్టును బీసీ (జనరల్)కి రిజర్వు చేశారన్నారు. జూన్ ఒకటి నాటికి 18 నుంచి 35 ఏళ్ల వయసు ఉండి, కనీసం 10వ తరగతి ఉత్తీర్ణత విద్యార్హత కలిగి, పై కేటగిరీల వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ప్రజలందరికీ మెరుగైన వైద్యసేవలు

- ఫలించిన ఎమ్మెల్యే రాజా కృషి
- సీతానగరం పీహెచ్‌సీ అప్‌గ్రేడ్
- వైద్య సిబ్బందిని కేటాయిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు



జక్కంపూడి రాజా, ఎమ్మెల్యే

సీతానగరం : నియోజకవర్గంలోని ప్రజలందరికీ మెరుగైన వైద్యసేవలు అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చేస్తున్న కృషి ఫలిస్తోంది. ఇందులో భాగంగా సీతానగరంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్‌సీ) 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)గా అప్‌గ్రేడ్ చేయాలన్న ఆయన ప్రతిపాదనకు ఇటీవలే రాష్ట్ర కేబినెట్ ఆమోదం లభించిన సంగతి తెలిసిందే. దీంతో మండలానికి స్పెషలిస్టు వైద్యుల సేవలు అందుబాటులోకి రానున్నాయి. 30 పడకల ఆసుపత్రితో 24 గంటలు వైద్య సేవలు సైతం అందుబాటులోకి వస్తాయి. సీహెచ్‌సీని పునర్వ్యవస్థీకరించిన నిబంధనలకు అనుగుణంగా వైద్య నిపుణులు, సిబ్బందిని మంజూరు చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ (జీవో ఎంఎస్ నంబర్ 84) ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీటి ప్రకారం ఒక సివిల్ అసిస్టెంట్ సర్జన్, స్పెషలిస్టులు జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఒబీజీ, పీడియాట్రిక్స్, అనస్థీషియా, జనరల్, డెంటల్ అసిస్టెంట్ సర్జన్, హెడ్ నర్స్, ఆరుగురు స్టాఫ్ నర్సులు, రేడియోగ్రాఫర్, గ్రేడ్–1, 2 ఫార్మాసిస్టులు, థియేటర్ అసిస్టెంట్, ఇద్దరు ల్యాబ్ టెక్నీషియన్లు, పోస్టుమార్టం అసిస్టెంట్, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు, ఆరుగురు జనరల్ డ్యూటీ అటెండర్లు, ఆఫీసు సబార్డినేట్ పోస్టులను ప్రభుత్వం మంజూరు చేసింది. కాగా.. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఈ పీహెచ్‌సీలో అరకొరగా వైద్యసేవలు అందేవి. ఒక వైద్యుడు, నామమాత్రపు సిబ్బందితో నెట్టుకొచ్చారు. జక్కంపూడి రాజా ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించడానికి చర్యలు చేపట్టారు.

కౌలు కార్డుతో అనేక ప్రయోజనాలు

రంగంపేట: ఖరీఫ్, రబీ సాగుకు సంబంధించి కౌలు రైతులంతా రెవెన్యూ శాఖ అందించే కౌలు గుర్తింపు కార్డు (సీసీఆర్‌సీ)లు తప్పనిసరిగా పొందాలని మండల వ్యవసాయాధికారి కూరాకుల శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కౌలు కార్డు పొందిన రైతులకు మాత్రమే పంట నమోదు చేయడానికి వీలుంటుందని, పంట నమోదులో పేరుంటేనే ప్రభుత్వం అందించే పథకాలు భూ యజమానులతో పాటు కౌలు రైతులకు కూడా వర్తిస్తాయన్నారు. కౌలు కార్డు తీసుకున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ రైతులకు వైఎస్సార్ రైతు భరోసా వర్తిస్తుందని, పండించిన పంటను కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవచ్చని, పంట నష్టం జరిగినప్పుడు నష్ట పరిహారం పొందవచ్చని తెలిపారు. దీనిపై ఏమైనా సందేహాలుంటే వీఆర్‌ఓలు, ఆర్‌బీకేల్లో ఉండే వీఏఏలను సంప్రదించాలన్నారు.

సర్వే 20 శాతం పూర్తి

మధురపూడి: కోరుకొండ మండలంలో జగనన్న సురక్ష సర్వే 20 శాతం పూర్తయ్యిందని ఎంపీడీఓ పీఎస్ నరేష్‌కుమార్ తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని 22 గ్రామాల్లో 29,700 కుటుంబాలు ఉన్నాయన్నారు. మండలంలో కోటి, కోటి కేశవరం, బొల్లెద్దుపాలెం, నర్సాపురం, కణుపూరు, గాదరాడ 1, 2 సచివాలయాల పరిధిలోని 5,700 కుటుంబాలకు సంబంధించి సర్వే జరుగుతోందన్నారు. ఇది ప్రస్తుతానికి 20 శాతం పూర్తయ్యిందన్నారు. వలంటీర్, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుంటున్నారన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

ధవళేశ్వరం: లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యానేరమని డిప్యూటీ డెమో ఎస్.సత్యకుమార్ అన్నారు. ధవళేశ్వరం పీహెచ్‌సీలో శుక్రవారం ఆశా కార్యకర్తలకు లింగనిర్ధారణ నిషేధ చట్టంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయాల్లో ఏర్పాటు చేసే సమావేశాల్లో పీసీపీఎన్‌డీటీ యాక్టుపై అవగాహన కల్పించాలన్నారు. హెల్త్ ఎడ్యుకేటర్ సత్యవతి మాట్లాడుతూ ఆడ, మగ బిడ్డలిద్దరూ సమానమని క్షేత్ర స్థాయిలో ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో శేషామణి, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

వంతెన నిర్మాణానికి సర్వే

గోకవరం: స్థానిక ఠాణాసెంటర్‌లో ఊరకాలువపై నూతన వంతెన నిర్మాణానికి శుక్రవారం ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు సర్వే నిర్వహించారు. 516–ఇ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా ఇక్కడ పాత వంతెన స్థానంలో రూ.10 కోట్లతో నూతనంగా వంతెన నిర్మించడానికి ఇటీవల నిధులు మంజూరయ్యాయి. దీనిలో భాగంగా ఆర్‌అండ్‌బీ జేఈ శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థల సేకరణ నిమిత్తం సర్వే నిర్వహించారు. త్వరలో పనులు ప్రారంభిస్తామని జేఈ తెలిపారు.

పారా లీగల్ వలంటీర్లకు ప్రత్యేక శిక్షణ

కంబాలచెరువు: జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో పారా లీగల్ వలంటీర్లకు శుక్రవారం ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత మాట్లాడుతూ పారా లీగల్ వలంటీర్లుగా నియమితులైన వారికి న్యాయ సేవలు, వివిధ చట్టాలపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. న్యాయ సేవాధికార సంస్థల చట్టం 1987, వివిధ నల్సా సంక్షేమ పథకాల గురించి వివరించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రత్యూష కుమారి, న్యాయవాది, ట్రెయిన్డ్ మీడియేటర్లు పి.శ్రీనివాసరావు, జి.కృష్ణ కపూర్, న్యాయవాది డి.వెంకటేశ్వరరావు, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ జె.మహేష్ వివిధ చట్టాలు, భారత రాజ్యాంగంపై అవగాహన కల్పించారు. అనంతరం జిల్లా న్యాయస్థాన ఆవరణలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత ఇన్సూరెన్స్ సంస్థల అధికారులు, ఇరుపక్షాల న్యాయవాదులతో సమావేశమయ్యారు. జూలై 22న జరగనున్న స్పెషల్ లోక్ అదాలత్‌లో వీలైనన్ని మోటారు వాహనాల కేసులకు పరిష్కారం చూపే దిశగా పని చేయాలని సూచించారు.

క్యాన్సర్ నిర్ధారణ శిబిరం

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక త్యాగరాజ నారాయణదాసు కల్యాణ మండపం ప్రాంగణంలో శుక్రవారం మాతృదేవోభవ మెగా క్యాన్సర్ నిర్ధారణ శిబిరం నిర్వహించారు. రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్, జీఎస్ఎల్ క్యాన్సర్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల నిర్వహించే ఈ శిబిరాన్ని రోటరీ గవర్నర్, ప్రముఖ ఆడిటర్ వి.భాస్కరరామ్‌తో కలసి ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యాధిని ముందుగా గుర్తించగలిగితే నయం చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ అధ్యక్షుడు తీగల రాజా మాట్లాడుతూ సుమారు నాలుగైదువేల రూపాయల విలువైన పరీక్షలను శిబిరంలో ఉచితంగా చేస్తున్నామన్నారు. ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోని వారు సైతం నేరుగా వచ్చి పేర్లు నమోదు చేసుకుని పరీక్షలు చేయించుకోవచ్చన్నారు. మహిళల్లో వచ్చే రొమ్ము, గర్భాశయ, గొంతు క్యాన్సర్లకు పరీక్షలు చేస్తామని, వ్యాధి నిర్ధారణ అయితే జీఎస్ఎల్‌లో ఆరోగ్యశ్రీలో వైద్యం అందుతుందన్నారు. శిబిరం నిర్వహణకు సహకరించిన జీఎస్ఎల్ చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, ప్రముఖ ఆంకాలజిస్ట్, డాక్టర్ తరుణ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ శిబిరంలో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలతో పాటు, దంత, సాధారణ వైద్య సేవలు అందించారు.

జాతీయ చదరంగం పోటీలకు సాయివిభు

ప్రకాశం నగర్: విజయనగరంలో గత 28 నుంచి 30 వరకూ జరిగిన అండర్ 7 రాష్ట్రస్థాయి చదరంగం పోటీల్లో నగరానికి చెందిన సాయివిభు సత్తా చాటి జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ విషయాన్ని జిల్లా చదరంగం సంఘం కార్యదర్శి జీవీ కుమార్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. పశ్చిమబంగాలో సెప్టెంబర్ 20 నుంచి జరిగే జాతీయ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి సాయివిభు ప్రాతినిధ్యం వహిస్తాడన్నారు.

గడప గడపకూ సంక్షేమమే లక్ష్యం

ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



రామేశ్వరంలో పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: గడప గడపకూ సంక్షేమ పథకాలు అందించడమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం రామేశ్వరంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సీఎం జగన్ సారథ్యంలో రాష్ట్రంలో అమలవుతున్న పథకాల ద్వారా ప్రజలు పొందిన లబ్ధిని ఆయన వివరించారు. పలు సమస్యలను స్థానికులు తెలపగా తక్షణం పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ గ్రామ వలంటీర్లు, సచివాలయ వ్యవస్థల ద్వారా ప్రభుత్వ పథకాలు అర్హుల ఇంటి ముంగిటకే చేరుతున్నాయన్నారు. వలంటీర్లు సైనికుల్లా పనిచేస్తూ మెరుగైన సేవలు అందిస్తున్నారని కొనియాడారు. ఏ గడపకు వెళ్లినా ప్రజలు ముఖ్యమంత్రి జగన్‌ను ఆశీర్వదిస్తున్నారని, ఆయనే తిరిగి సీఎం కావాలని కోరుకుంటున్నారని అన్నారు. కొత్త జిల్లాల ఏర్పాటులో భాగంగా పెదపూడి మండలాన్ని కాకినాడ జిల్లాలో కలపడానికి కృషి చేసిన ఎమ్మెల్యేకు తామంతా రుణపడి ఉంటామని ప్రజలు చెప్పారు. ప్రజలు అడుగడుగునా పూల వర్షం కురిపించారు. సన్మానాలు చేసి హారతి లిచ్చి స్వాగతం పలికారు. జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మి, సర్పంచ్ కొటికలపూడి చినబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు బసవ విజయకుమారి, గ్రామ కన్వీనర్ గాజుల మణికంఠ, ఆలయ కమిటీ చైర్మన్ గంగుమళ్ల సుబ్రహ్మణ్యం, ఉప సర్పంచ్ కొటికలపూడి వరలక్ష్మి పాల్గొన్నారు.

సంతృప్తికర సేవలే లక్ష్యంగా 'జగనన్న సురక్ష'

ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: అర్హులందరికీ పథకాలు, సంతృప్తికర ప్రభుత్వ సేవలు అందించాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహణపై ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ నాయకులతో ఎమ్మెల్యే ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల పెత్తనంతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురయ్యారన్నారు. ప్రభుత్వ పథకాలతో పాటు వివిధ పనుల కోసం ప్రజలు అనేక వ్యయప్రయాసలకోర్చి మండల కేంద్రాల్లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో తీసుకు వచ్చిన విప్లవాత్మక సంస్కరణలతో పారదర్శకంగా, అవినీతి రహిత పాలనకు నాంది పలికారని అన్నారు. జూలై 1 నుంచి నాలుగు వారాల పాటు జరిగే జగనన్న సురక్ష క్యాంపుల్లో గుర్తించిన ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. దీనిద్వారా ఎటువంటి రుసుం తీసుకోకుండా 11 రకాల ధ్రువపత్రాలు ఉచితంగా మంజూరు చేస్తామన్నారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు తమ పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే కోరారు. సర్పంచ్ వారా కుమారి, వైస్ ఎంపీపీ కర్రి దాసు, రాష్ట్ర రెడ్డి, భట్రాజుల కార్పొరేషన్ డైరెక్టర్లు సత్తి రామకృష్ణారెడ్డి, షణ్ముఖి చిట్టిరాజు, పార్టీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి చిర్ల వీర్రాఘవరెడ్డి, పార్టీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు ఎస్ఎస్, చేనేత విభాగం అధ్యక్షుడు పెనుగొండ శ్రీను, పడాల శ్రీనివాసరెడ్డి, మల్లిడి నితిన్‌రెడ్డి, కానూరి కృష్ణ పాల్గొన్నారు.

చురుగ్గా సర్వే

మధురపూడి: కుష్ఠువ్యాధి నిర్మూలనే ధ్యేయంగా లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపు సర్వే జరుగుతోందని కోటి కేశవరం పీహెచ్‌సీ డాక్టర్ పుణ్యశాంతి అన్నారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 19వ తేదీన ప్రారంభమైన సర్వే జోరుగా సాగుతోందన్నారు. గ్రామాల్లో ఆశా వర్కర్లు, వలంటీర్లతో కలిసి సర్వే చేస్తున్నట్టు తెలిపారు. ఇప్పటి వరకూ 20 శాతం పూర్తయ్యిందన్నారు. నరాల బలహీనత, స్పర్శలేని మచ్చలున్న వారు తమ సమస్యలను ఆశా వర్కర్లకు తెలియజేయాలని కోరారు. ఈ సర్వే రిపోర్టును లెప్రసీ విభాగానికి పంపడంతో పాటు పరీక్షించి వైద్యసేవలు అందజేస్తామన్నారు.